క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



పెడన: పురపాలక సంఘ పరిధిలో ప్రధాన రహదారి పక్కన చేపల మార్కెట్ సమీపంలోని ఆక్రమణలను గురువారం మున్సిపల్ అధికారులు తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన మట్టిని తీయించి లోతట్టు ప్రాంతాలకు తరలించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, టీపీవో సుజనకుమారి సిబ్బందితో ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు.

మందుల కొరత లేకుండా చూడాలి



కృత్తివెన్ను: ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు అవసరమైన మందులతో పాటు అత్యవసరమైన పాము, కుక్కకాటు మందులను పూర్తిస్థాయిలో ఉంచుకోవాలని, కొరత లేకుండా చూడాలని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. గురువారం ఆయన లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీపీ.. రోజువారీ ఓపీ ఎంత ఉంటుంది, పీహెచ్‌సీలో మందుల నిల్వలు, ఉద్యోగుల పనితీరు తదితర విషయాలను పరిశీలించారు. ఆయనతో పాటు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోండి



ఘంటసాల: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకోవాలని ఘంటసాల పీహెచ్‌సీ డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ అన్నారు. ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వ్యాక్సినేషన్ చేశారు

- ఘంటసాల సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బండి రాజమ్మ జ్ఞాపకార్థం వారి కోడలు బండి ధనలక్ష్మి సహకారంతో ఘంటసాల పీహెచ్‌సీకి వచ్చిన 24 మంది గర్భిణులకు పండ్లను డాక్టర్ ప్రమోద్‌కుమార్ పంపిణీ చేశారు.

ఆటల పోటీల సందడి



మచిలీపట్నంటౌన్: నగరంలోని హిందూ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న వీర్నాల సంక్రాంతి స్టైమ్ ఆటల పోటీలు గురువారం రెండో రోజు కొనసాగాయి. చెస్, కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు పలు అంశాలపై అనర్గళంగా మాట్లాడి ప్రతిభ చాటారు. నిర్వాహకుడు వీర్నాల బాలాజీ పర్యవేక్షించారు. కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధర్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, పెడన ఎమ్మెల్యే కాగిత విజేతలకు బహుమతులు అందజేశారు.

వైభవంగా నాగేశ్వరస్వామి తిరునాళ్ల

బంటుమిల్లి: ములపర్రు పంచాయతీ శివారు గొల్లగూడెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పార్వతి సమేత నాగేశ్వరస్వామి వార్షిక తిరునాళ్ల గురువారం వైభవంగా నిర్వహించారు. పలు గ్రామాల పండితులు లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సహస్ర కుంకుమార్చన చేశారు. చినతుమ్మిడి గ్రామానికి చెందిన తాళమ్మతల్లి కోలాట బృందం చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. కమిటీ అధ్యక్షుడు యలవర్తి ఆంజనేయులు, సభ్యులు, పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మోపిదేవి: ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాలను కొత్త రేషన్ డీలర్ల ద్వారా భర్తీ చేయడానికి చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. అర్హులు ఈ నెల 16, 17 తేదీల్లో సాయంత్రం 5 గంటలలోపు మచిలీపట్నం ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తులు పొందాలని సూచించారు. రాత పరీక్ష ఈ నెల 18వ తేదీ శనివారం ఉదయం 10.30 నుంచి జరుగుతుందని, దీనికి సంబంధించి మౌఖిక పరీక్ష 20వ తేదీ సోమవారం 11 గంటలకు నిర్వహిస్తారని తెలిపారు. వివరాలు హాల్‌టికెట్‌లో పొందుపరిచి ఉంటాని పేర్కొన్నారు.

40 మద్యం సీసాలు స్వాధీనం

కృత్తివెన్ను: మద్యం అక్రమంగా ఉన్నవారిపై దాడులు చేసి 40 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు కృత్తివెన్ను ఎస్ఐ పైడిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కృత్తివెన్ను, చినపాండ్రాక గ్రామాల్లో మద్యం సీసాలు కలిగిఉన్న వారిపై గురువారం దాడులు చేసి కేసులు నమోదు చేశామన్నారు. నిడమర్రులో నాటుసారా తయారీ కేంద్రంపై చేసిన దాడుల్లో 100 లీటర్లు బెల్లంఊటను ధ్వంసం చేయడంతో పాటు, రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

డంపింగ్‌యార్డ్ తరలించేదెప్పుడో!

- అవనిగడ్డలో రోడ్డు పక్కన చెత్త నిల్వలు
- ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎప్పుడూ విమర్శలే
- గత ప్రభుత్వంలో మూడుసార్లు తరలింపు యత్నాలకు అడ్డంకులు
- గతంలో ఆందోళనలు, విమర్శలు చేసిన జనసేన నేతలు
- నేడు పట్టించుకోని వైనం



రహదారి పక్కన చెత్తతో నిండిన అవనిగడ్డ డంపింగ్‌యార్డ్

అవనిగడ్డ: ప్రతిపక్షంలో హడావుడి చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత అవనిగడ్డ డంపింగ్‌యార్డ్ ఊసే ఎత్తడం లేదు పాలకులు. డంపింగ్ యార్డ్‌ను తరలించాలని ఆందోళనలు చేసిన జనసేన నేతలు నేడు కనిపించడం లేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే డంపింగ్‌యార్డును తరలిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడచినా దీనిగురించి పట్టించుకున్న వారే కరువయ్యారు.

గత ప్రభుత్వంలో తరలింపునకు అడ్డగింత

అవనిగడ్డ – నాగాయలంక ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్న డంపింగ్‌యార్డు ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. వ్యర్థాల కోసం వచ్చే పందులు, కుక్కల కారణంగా వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి గత ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు డంపింగ్ యార్డు తరలింపుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. అవనిగడ్డ జెడ్పీ హైస్కూల్ కరకట్ట, ఎడ్లంక, అశ్వారావుపాలెం రోడ్డులో దీన్ని తరలించడానికి మూడుసార్లు ప్రయత్నించగా అప్పటి జనసేన నేతలు స్థానికులతో ఆందోళనలు చేయించి, పిటీషన్లు వేయించి అడ్డుకున్నారు. దీంతో డంపింగ్‌యార్డు తరలింపు సాధ్యం కాలేదు. డంపింగ్ యార్డుని తరలించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని నాడు మండలి బుద్ధప్రసాద్ తీవ్ర విమర్శలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా డంపింగ్‌యార్డు తరలింపును ఎవరూ పట్టించుకోవడం లేదు. అవనిగడ్డలో జనసేన ఎమ్మెల్యే ఉన్నారు. పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నేడు డెప్యూటీ సీఎంగా ఉన్నారు. ఆ పార్టీ నేత వల్లభనేని బాలశౌరి మచిలీపట్నం ఎంపీగా ఉన్నారు. అయినా డంపింగ్ యార్డు తరలింపును పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.

పెరుగుతున్న ప్రమాదాలు

అవనిగడ్డ ఊరి చివర, నాగాయలంక ప్రధాన రహదారి మలుపు వద్ద డంపింగ్‌యార్డు ఉంది. దీంతో ఈ ప్రాంతంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇక్కడ చెత్త వేయడం.. వాటి కోసం వచ్చే పందులు, కుక్కలు వాహనచోదకులు వెంట పడుతుండటంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికి తోడు చెత్త పెరిగి రోడ్డు వైపునకు జారుతోంది. వర్షాకాలంలో అయితే లోపలకు చెత్త వాహనం వెళ్లే పరిస్థితి లేక రహదారి పక్కనే వేసేస్తారు. దీనివల్ల తీవ్ర దుర్గంధం వస్తుంటుంది. ఇటువైపు వస్తే ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ డంపింగ్ యార్డు తరలింపుపై దృష్టి పెట్టాల్సి ఉందని ఈ ప్రాంత ప్రజలు, వాహనచదోకులుకోరుతున్నారు.

దాటామంటే గండం గడచినట్టే

విధులు నిర్వహించడానికి నాగాయలంకకు రోజూ బైక్‌పై వెళ్లాలి. డంపింగ్ యార్డు ప్రాంతానికి రాగానే కుక్కలు అడ్డుపడుతూ ఉంటాయి. చాలా జాగ్రత్తగా వెళ్లాల్సి ఉంటుంది. ఆదమరిస్తే ఇబ్బందులే. డంపింగ్ యార్డు దాటామంటే గండం గడచినట్టే అనుకుంటాం.

–బి.రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయుడు, అవనిగడ్డ

ముక్కు మూసుకెళ్తాం

అవనిగడ్డ వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. డంపింగ్‌యార్డ్ వద్దకు రాగానే తీవ్ర దుర్వాసన వస్తోంది. ముక్కు మూసుకుని వెళ్లాల్సి ఉంటుంది. దీనికి తోడు అక్కడ ఎప్పుడూ కుక్కలు, పందులు ఉంటాయి. వాటితో చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే ప్రమాదమే.

–యక్కటి శ్రీనివాసరావు, నాగాయలంక

ప్రజలపై భారాలను మోపొద్దు

సీపీఎం నేతలు



ట్రూఅప్ చార్జీల బిల్లులను దగ్ధం చేస్తున్న సీపీఎం నేతలు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఇంధన సర్‌చార్జీ పేరుతో ప్రజలపై వేసిన భారాలను వెంటనే రద్దు చేయాని సీపీఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. నగరంలో రాజుపేట ప్రాంతంలోని 37, 38, 39 డివిజన్లలో గురువారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ ట్రూఅప్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వేసే భారాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల కాలంలోనే రూ. 15,486 కోట్ల భారం ప్రజలపై వేసిందని, వీటిని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం సీనియర్ నేత కొడాలి శర్మ, నగర కమిటీ సభ్యులు చంద్రపాల్, సీహెచ్ జయరావు, ఎండీ యూనస్, కొడాలి సుజాత, విజయలక్ష్మి, బూర భవాని, ఈడే రామారావు తదితరులు పాల్గొన్నారు.

పదవులను బాధ్యతగా భావిస్తేనే మేలు

నాగాయలంక డీసీ సర్వసభ్య సమావేశంలో ఇరిగేషన్ డీఈఈ



నాగాయలంక డీసీ సమావేశంలో మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వరరావు

మర్రిపాలెం(నాగాయలంక): నీటి సంఘాల అధ్యక్షులు పదవులను అధికారంగా భావించకుండా బాధ్యతగా రైతాంగానికి సేవలు చేస్తే విస్తృత ప్రయోజనాలు చేకూరి సంతృప్తి మిగులుతుందని పులిగడ్డ సబ్ డివిజన్ ఇరిగేషన్ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు చెప్పారు. నాగాయలంక వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ తొలి సర్వసభ్య సమావేశం గురువారం మర్రిపాలెంలోని నాగాయలంక ఇరిగేషన్ కార్యాలయంలో జరిగింది. డీసీ అధ్యక్షుడు బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు(చినబాబు) అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగాయలంక ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో 43వేల ఎకరాల ఆయకట్టుతో పెద్దగా ఉండటంతో సిబ్బంది కొరత అధికంగా ఉందని తెలిపారు. నిధుల లభ్యతను అనుసరించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఏఈఈ పొన్నూరు రవితేజ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు రూ.17 కోట్లు, కరకట్టల పటిష్టతకు రూ.2400 కోట్లు, సెక్షన్ పరిధిలో యూటీలు మరమ్మతులకు మరో రూ.10కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారని వివరించారు. డ్రైనేజీ ఏఈఈ పి.చిరంజీవి మాట్లాడుతూ మండలంలోని మంగలేరుపై నాలి వద్ద కర్రల వంతెన స్థానంలో పెద్ద బ్రిడ్జి కట్టడానికి, అయిదు ఔట్ ఫాల్స్ స్లూయిజ్‌ల నిర్మాణానికి డిజైన్‌లు ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించామన్నారు. సమావేశంలో డీసీ ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ నరసింహారావు, డ్రైనేజి డీఈఈ జె.బాబు నాయక్, డీసీ పరిధిలోని పన్నెండు నీటిసంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ముక్కోటి దర్శనానికి ఆలయాల ముస్తాబు



ఉల్లిపాలెంలో శ్రీమన్నారాయణుడు



విద్యుత్ దీపాలతో ముస్తాబైన గొడుగుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం

కోడూరు: శ్రీమహావిష్ణువు గరుడ వాహనంపై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగి వచ్చి భక్తులకు దర్శనమిచ్చే ముక్కోటి ఏకాదశి పర్వదినానికి వైష్ణవాలయాలను ముస్తాబు చేశారు. అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 5గంటల నుంచి ఉత్తరద్వార దర్శనం ద్వారా భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామి గురువారం తెలిపారు. కోడూరులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము 4.30 నుంచి భక్తులకు ముక్కోటి దర్శనాలకు అవకాశం కల్పిస్తున్నట్లు ధర్మకర్త పద్మావతి వరప్రసాద్ చెప్పారు.

శ్రీకాకుళం(ఘంటసాల): వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనానికి శ్రీకాకుళేశ్వర స్వామి దేవస్థానం విద్యుత్ కాంతులతో మెరిసిపోతోంది. ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులకు స్వామి వార్లను దర్శించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వర ప్రసాదరావు గురువారం తెలిపారు. ఆయన శ్రీకాకుళంలోని ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించారు.

మచిలీపట్నంటౌన్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం నగరంలోని పలు వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వారా దర్శనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయాలకు, గాలిగోపురాలను విద్యుత్ దీపాలతో శోభాయ మానంగా అలంకరించారు. బచ్చుపేట, గొడుగుపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాలు, రుస్తుంబాదలోని శ్రీ భద్రాద్రి రామాలయం, రాబర్ట్‌సన్‌పేటలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయం ముస్తాబయ్యాయి.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



కోడూరులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

కోడూరు: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని సంప్రదాయ ముసుగులో కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనునాయక్ హెచ్చరించారు. గురువారం స్థానిక కార్యాలయంలో ప్రత్యేకంగా ముద్రించిన పోస్టర్లను మండలాధికారులతో కలిసి ఆవిష్కరించారు. జూదాలతో అనేక కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని, పందేల బరులు ఏర్పాటు చేసినా, గ్రామ శివారుల్లో పందెలు నిర్వహించినా చర్యలు తప్పవని తహసీల్దార్ చెప్పారు. సంప్రదాయ క్రీడాలకు ప్రాధాన్యమిస్తూ వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించుకోవాలని సూచించారు. గతంలో కోడిపందేల్లో పట్టుబడినవారిని ముందుస్తుగానే బైండోవర్ చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఈఓపీఆర్డీ నాగరేవతి, డీటీ పద్మప్రియ, ఆర్ఐ సుభాషిణి, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల: ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో కోడి పందేలు నివారించడానికి మండల స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయప్రసాద్ మాట్లాడుతూ కోడి పందేలు నివారించాలని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉన్నతాధికారుల సూచనతో ఘంటసాల మండలంలో కోడి పందేలను నివారించడానికి మండల, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డి, మండల పశు వైద్యాధికారి డాక్టర్ పి.మనోజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మోపిదేవి: మండలంలో కోడిపందేలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలని తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం పలుశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈఓపీఆర్‌డీ త్రిపురసుందరీ, ఇన్‌చార్జ్ ఆర్ఐ మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

పామర్రు: విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి, చదువుకు దగ్గరగా ఉండాలని కనుమూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు ఖాన్ తెలిపారు. కనుమూరు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో కిశోర వికాశం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు అధికంగా వాడితే విద్యార్థుల్లో మెదడు సక్రమంగా పని చేయదని తెలిపారు. బాల్య వివాహాలతో కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతాయని పేర్కొన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు పలు చట్టాలు ఉన్నాయని వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లలపై లైంగిక వేధింపులు, అసభ్య ప్రవర్తనలను ఉపాధ్యాయులు గ్రహించి వాటిని సత్వరమే నిర్మూలించాలని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి మాట్లాడుతూ యవ్వన దశ పట్ల అవగాహన లోపంతో ఆకర్షణ ద్వారా ఎదుర్కొనే ఇబ్బందులను పరిష్కరించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. పోషకాహారం, శారీరక శుభ్రతతో పాటు యోగా ప్రతి రోజూ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం శారద కాంత, హెల్త్ అసిస్టెంట్ సూర్యకళ, ఏఎన్‌ఎం పద్మ, అంగన్‌వాడీ ఇన్‌స్ట్రక్టర్లు పుష్పావతి, ప్రసన్న పాల్గొన్నారు.

ముందే వచ్చిన సంక్రాంతి



చిన్నారులకు భోగి పళ్లు పోస్తున్న దృశ్యం



కొమ్మారెడ్డి పాఠశాలలో చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న ఉపాధ్యాయినులు.

పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలు

కోడూరు: సంక్రాంతి వేడుకలను పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో గురువారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కోడూరు జీవీ అకాడమీ, కోట రాఘవయ్య విద్యాసంస్థల్లో విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు జరిగాయి. సంక్రాంతి పండుగ ప్రతిబింబిచేలా ముగ్గులను తీర్చిదిద్దారు. పాఠశాలల ఆవరణలో బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. విద్యార్థులను హరిదాసుడు, శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలో అలంకరించారు. చిన్నారులపై ఉపాధ్యాయులు భోగిపండ్లు బోసి ఆశీర్వచనాలందించారు. విద్యార్థినులు పట్టు పరికిణీలు ధరించి సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. సరదాగా కోడిపందేలు వేసి విద్యార్థులను ఉత్సాహపర్చారు.

నాగాయలంక: స్థానిక విద్యాభారతి పబ్లిక్ పాఠశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలు కోలాహలంగా జరిగాయి. బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సందడి చేశారు.

మచిలీపట్నంటౌన్: రంగురంగుల రంగవల్లులు, రంగవల్లులపై గొబ్బెమ్మలు, పువ్వులు, గంగిరెద్దుల విన్యాసాలు, చిన్నారులు ఎగురవేసిన పతంగులు, చిన్నారులకు భోగి పండ్లు, హరిదాసు గీతాలు, కట్టెల పొయ్యిపై పాల పొంగళ్లు. ఆటపాటలతో బలరామునిపేటలోని గాంధీ విద్యాలయం ఆవరణ గురువారం సంక్రాంతి శోభను సంతరించుకుంది. విద్యాలయంలో చిన్నారులకు ఉపాధ్యాయులు ఆనవాయితీ ప్రకారంగా భోగి పండ్లు పోశారు. కార్యక్రమాన్ని విద్యాలయం నిర్వాహకులు తాడేపల్లి మెహర్‌బాబా, శ్యామల, ఉడత్తు కిషోర్, గుడివాడ ప్రకాష్, కల్యాణి, మాజేటి చక్రవర్తి, అరుణ, భవాని, మాధవి తదితరులు పర్యవేక్షించారు.

పెడన: స్థానిక మఠం వీధిలో ఉన్న కళాంజలి హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులందరికీ వారి తల్లులు, ఉపాధ్యాయులు భోగి పళ్లు పోసి పూజలు జల్లి ఆయురారోగ్యాలతో, భోగభాగ్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. అనంతరం హైస్కూల్ విద్యార్థినులకు రంగవలుల పోటీలు నిర్వహించారు. కరస్పాండెంట్ కె.ప్రసన్నలక్ష్మి, ప్రిన్సిపాల్ కె.దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేవేంద్ర జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థినిలు రంగవల్లుల పోటీల్లో పాల్గొన్నారు. హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు దుర్గ, రవిచంద్ర, భానుశ్రీ, జ్యోతి తదితర ఉపాధ్యాయులు విద్యార్థులకు బహుమతులను అందజేసిన వారిలో ఉన్నారు.

గూడూరు: పోలవరం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని బొప్పన విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం సంబరాలు జరిగాయి. విద్యార్థులు రంగవల్లులు, గొబ్బెమ్మలు, భోగి మంటలు, నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

కొమ్మారెడ్డి పాఠశాలలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ బొమ్మలకొలువును ప్రారంభించారు. కార్యక్రమాల్లో పాఠశాలల డైరెక్టర్లు కె.కిషోర్, సాబు జాన్, శోభ, ఝాన్సిసాబూ, ఎస్. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కోడూరు జీవీ అకాడమీలో భోగి మంటల వద్ద విద్యార్థుల సందడి



పందెం కోడి పుంజులతో విద్యార్థినులు



సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో రంగవల్లులు తీర్చిదిద్దిన విద్యార్థినులు



కళాంజలిలో రంగవల్లులను దిద్దుతున్న విద్యార్థినులు



పోలవరం ప్రాథమికోన్నత పాఠశాలలో సంబరాలు

బాలలతో గీత, విష్ణు సహస్రనామ పారాయణం



నాగాయలంకలో భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న బాలలు

నాగాయలంక: శ్రీరుక్మిణీ శ్రీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం ప్రాంగణంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూల్ బాలలు చేసిన భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం అలరించింది. ప్రిన్సిపాల్ మండ పుష్పలత నేతృత్వంలో 50మంది బాల బాలికలు సామూహికంగా లయబద్ధంగా పారాయణం చేశారు. వీటితో పాటు బాలలు స్మరించిన గోవింద నామాలు ఆకట్టుకున్నాయి. తొలుత భక్తిశ్రద్ధలతో గోదాదేవి విశేష పూజలో బాలలు పాల్గొన్నారు.అర్చకుడు డీవీకే సత్యప్రసాద్ నేతృత్వంలో ఆలయంలోని శ్రీరుక్మిణీ, శ్రీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి మూల విరాట్టులకు, గోదాదేవి పీఠం వద్ద ప్రత్యేక పూజ, విశేష అలంకారం జరిపారు. ఉపాధ్యాయులు తలశిల రజని, మాదివాడ అశ్విని, తల్లిదండ్రులు, గీతాసమాజం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తుంగపల్లెమ్మ ఆలయంలో హుండీ చోరీ

కోడూరు: మాచవరంలోని తుంగపల్లెమ్మ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు హుండీ చోరీకి పాల్పడ్డారు. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి ఆలయ ప్రధానార్చకుడు మాచవరం జగదీష్ అమ్మవారికి పూజలనంతరం ఆలయానికి తాళాలు వేసి వెళ్లాడు. అర్ధరాత్రి వేళ దొంగలు ఆలయ తాళాలను పగలగొట్టి లోపలకు చొరపడ్డారు. హుండీని కట్టింగ్ మిషన్‌తో కోసి అందులోకి ఉన్న నగదును అపహరించారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఉండగా వీటిని కూడా దొంగలు పక్కకు తప్పించి, హార్డ్‌డిస్క్ బాక్స్‌ను కూడా అపహరించారు. హుండీలో సుమారు రూ.3 వేల నగదు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. హుండీ చోరీ ప్రదేశాన్ని అవనిగడ్డ సీఐ యువకుమార్ పరిశీలించారు. మచిలీపట్నంకు చెందిన డాగ్ స్క్వాడ్ బృందంతో పాటు ఫొరెన్సిక్ నిపుణులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, ఆధారాల సేకరించారు. హుండీపై ఉన్న వేలిముద్రలను సేకరించారు. కమిటీ సభ్యుల ఫిర్యాదుతో ఘటనపై కోడూరు పీఎస్‌లో కేసు నమోదైంది.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై సదస్సు

నాగాయలంక: పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై మండలంలోని గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు జరిగింది. నేషనల్ ఇంటిగ్రేషన్ రూరల్ డెవలప్‌మెంట్(ఎన్‌ఐఆర్‌డీ) సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ ఏడుకొండలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు తయారీలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు అన్ని వివరాలు, రీసోర్స్‌ను సేకరించుకుని, ఎంపిక చేసుకున్న సంకల్ప్ (థీమ్)కు అనుగుణంగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. పంచాయతీ రాజ్ విస్తరణాధికారి కలపటపు అప్పలనరసమ్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వ్యక్తిగత బ్రాండింగ్‌కు ప్రాధాన్యం

గుడివాడ టౌన్: డిజిటల్ యుగంలో వ్యక్తగత బ్రాండింగ్ ప్రాముఖ్యతను తెచ్చిపెడుతుందని కేఎల్ బిజినెస్ స్కూల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి. మధులత అన్నారు. గురువారం స్థానిక ఏఎన్నార్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో బ్రాండ్ మేనేజ్‌మెంట్‌కు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు.